గురించి యీ మాత్రము త్యాగముచేయవూ !" అంటూ అతని కండ్లలోకి చూచింది.

పొంగిపొరలే దుఃఖముతో చింతనిప్పుల్లాగున్న కండ్లు "నీ కొరకుగాను యీ త్యాగం చేస్తున్నాను" అన్నట్లుగా క్రమంగా చిన్నబోయినవి.

సీత, మోహన్‌లకు రాధ ప్రేమ పూర్వకమైన ఆశీస్సులతోటి వైభవంగా వివాహం జరిగింది. తనకు బ్రహ్మచారిణిగా తన చెల్లెలు, మోహన్‌ల ప్రేమ, విశ్వాసాలకు ఏనాడు కొరతయుండదని ఆశించింది.

◆ ◆ ◆



మోహన్‌కు బెంగుళూరులో ఉద్యోగముయింది. సీతను కూడ తీసికొనివెళ్ళి కాపురంపెట్టి కులాసాగా యుంటున్నారు. నెలలు, సంవత్సరాలు గడచి పోతున్నవి. మోహన్ అయినా ఎప్పుడైనా జాబు వ్రాసేవాడు కాని సీత మాత్రం వ్రాసేదికాదు.

రాధ ప్రాక్టీసు బాగా అభివృద్ధి చెందింది. పేద, సాద అనే విచక్షణతో ప్రజాదరణతోబాటు పుష్కలంగా డబ్బు సంపాదించింది. స్వంతంగా యిల్లు కట్టించుకోవాలని తలంకొని కట్టుబడి ప్రారంభించిన కొద్దికాలానికే బ్యాంకి దివాలాతీసి ఆమెది 70 వేల రూపాయలు మునిగిపోయినవి. ఆమెకు ఏమిచెయ్యడానికి తోచలేదు. సగంలో కట్టుబడి నిలబడిపోయిన యిల్లు పూర్తికావడానికి 20 వేల రూపాయలు కావాలి. ఆయిల్లు ఏనాటికైనా తన చెల్లెలికేకదా. వాళ్ళనే అడిగి డబ్బుతెచ్చి యింటి కట్టుబడి పూర్తిచేయడం మంచిదని ఉద్దేశించి రెండుమూడు జాబులు వ్రాసింది. దానికి జబాబైనా లేదు. తనే స్వయంగా పోదలచి తాను వస్తున్నాననీ, కారు పంపవలసినదిగా జాబువ్రాసి బెంగుళూరుకు బయలుదేరి వెళ్ళింది.

రైలుదిగి స్టేషనుకు మోహన్‌గాని, సీతగాని ఎవరైనా వచ్చారేమోనని నలువైపులా చూచింది. ఎవరూ కనుపించలేదు. బండిచేసికొని యింటికి వెళ్ళింది.

